వందేళ్ల వారధి కథ
ముగిసినట్లే.!

శతాబ్దానికి పైగా రవాణ అవసరాలను తీర్చిన ముసారంబాగ్ బ్రిడ్జి

- ఇక్కడ కొత్త వంతెన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం
- అంబర్‌పేట – దిల్‌సుఖ్‌నగర్ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- ఇటీవల వరదలతో బ్రిడ్జి పటిష్టతపై అనుమానాలు
- వంతెన పటిష్టతపై త్వరలో నివేదిక ఇస్తామన్న డీఈ రోహిణి


ముసారంబాగ్ పాత బ్రిడ్జి పక్కనే నిర్మాణమవుతున్న కొత్త బ్రిడ్జి

అంబర్‌పేట: మూసీనదిపై ముసారంబాగ్ వద్ద ఉన్న పురాతన బ్రిడ్జి కథ ముగిసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మూసీ నది ఉధృతంగా ప్రవహించింది. భారీ నీటి ప్రవాహంతో ముసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి నీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. దీంతో సమీప ఇళ్లలోకి కూడా వరద వచ్చి చేరింది. ఏకధాటిగా వారం రోజులకు పైగా నీరు బ్రిడ్జికి అనుకుని ప్రవహించడంతో బ్రిడ్జి బలహీన పడింది. బ్రిడ్జిపై ఉన్న తారు కొట్టుకుపోయింది. పిల్లర్లు, స్లాబ్ సిమెంటు పెచ్చులూడిపోయాయి.

◆ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడడంతో ఉస్మాన్ సాగర్, హిమయాత్‌సాగర్‌ల గేట్లు ఎత్తివేయడంతో మూసీలోకి భారీ వరద ప్రవాహం వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మూసీ ప్రమాదకరంగా ప్రవహించింది. పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే పరిస్థితులు తలెత్తాయి. ముసారంబాగ్ వద్ద ఉన్న పురాతన బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో నీటిలో మునిగిపోయింది. దీంతో దాని పటిష్టత ప్రమాదంలో పడింది. నేటికీ బ్రిడ్జిపై నుంచి రాకపోకలను అనుమతించడం లేదు.

పరిశీలించిన ప్రాజెక్ట్ అధికారులు...

◆ బ్రిడ్జి పటిష్టతపై జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ విభాగం అధికారులు రెండు రోజుల క్రితం బ్రిడ్జిని పరిశీలించారు. కావాల్సిన నమూనాలను తీసుకున్నారు. రెండు మూడు రోజుల్లో బ్రిడ్జి వినియోగించవచ్చా లేదా అని విషయాన్ని తేల్చనున్నారు. సుమారు 130 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పు ఉన్న పటిష్టతపై సరైన అంచన వేయడానికి ఇంజినీరింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో నివేదిక అందిస్తామని ప్రాజెక్ట్ డీఈ రోహిణి తెలిపారు.

వంద సంవత్సరాలుగా రాకపోకలు...

◆ వందేళ్లగాకు పైగా అంబర్‌పేట – దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలకు ముసారంబాగ్ బ్రిడ్జి వారిధిగా సేవలందించింది. నిత్యం వేలాది ప్రజలు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగించారు. మూసీపై ఉన్న ప్రధాన వంతెనల్లో ముసారంబాగ్ బ్రిడ్జి ఒకటి. ప్రజా రవాణ అవసరాలను వందేళ్లకు పైగా చెక్కుచెదరకుండా తీర్చింది. రోజు రోజుకు నగరంలో పెరిగిన రద్దీతో ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలకు భారీగా పెరిపోయింది. అలాగే ప్రతి వర్షాకాలంలో వరద ప్రవాహం బ్రిడ్జిపై నుంచి వెళ్తుండడంతో బలహీనపడుకుంటూ వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తిగా దెబ్బ తినడంతో పురాతన బ్రిడ్జి కనుమరుగు కానుంది.

ప్రత్యామ్నాయంగా కొత్త బ్రిడ్జి...

◆ ముసారంబాగ్ పాత బ్రిడ్జికి ప్రత్యామ్నాయంగా కొత్త నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించింది. పాత బ్రిడ్జికి అనుకుని సమీపంలోనే కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సుమారు మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ఎప్పటి వరకు పూర్తి అవుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. త్వరలో పూర్తి అని ప్రతి ప్రజా ప్రతినిధి, ప్రతి ఉన్నాతధికారి ప్రకటిస్తున్నారే తప్ప బ్రిడ్జి నిర్మాణం కొలిక్కిరావడం లేదు.


మూసీలో వరద ప్రవాహం

మూడేళ్లుగా సాగుతూనే...

◆ మూడు సంవత్సరాల క్రితం ఇక్కడ కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించడంతో పాత బ్రిడ్జిపై నుంచి ఒక వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కేవలం దిల్‌సుఖ్‌నగర్ వైపు వాహనాలను అనుమతించి... అంబర్‌పేట వైపు నుంచి దిల్‌సుఖ్ నగర్ వెళ్లే వాహనాలను అనుమతించడం లేదు. దీంతో అలీకేఫ్ చౌరస్తా, గోల్నాక తదితర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తాజాగా పాత బ్రిడ్జిసైతం మూతపడడంతో వాహనదారులు చుక్కలు చూస్తున్నారు. కొత్త బ్రిడ్జి నిర్మాణంలో త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అరోరాలో 'గో గ్రీన్.. బ్రీథ్ గ్రీన్'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అసోసియేట్ ప్రొ. డా. రజినీ అన్నారు. సోమవారం ఆరోరా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో 'గో గ్రీన్.. బ్రీథ్ గ్రీన్'అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. యువత అనుకుంటే అసాధ్యం అనేది ఏదీ లేదని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షణకు యువత ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు రూపొందించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఏఎన్ఓ మేజర్ షేక్ శిలార్ పాల్గొన్నారు.

ఉపఎన్నికలో పోటీ చేస్తాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ప్రజా సంఘాల తరుపున పోటీ చేస్తామని తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు సుదమల్ల వెంకటస్వామి తెలంగాణ ఉద్యమకారులు జేఏసీ అధ్యక్షుడు ప్రఫూల్ రామిరెడ్డి అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని పేర్కొన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వోర్క డెంట్ మల్టీస్పెషాలిటీ డెంటల్ క్లినిక్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది పాల్గొని చికిత్స చేయించుకున్నారు. అనంతరం క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీవీ నిరంజన్‌రెడ్డి, ఎస్.మనోహర్‌రెడ్డి మాట్లాడారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని కోరారు.

హుండీ కానుకల లెక్కింపు

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండీ కానుకలను సోమవారం సోమవారం లెక్కించారు. ఆదాయం రూ.1,24,764 వచ్చిందని ఈఓ మాచర్ల దేవనాథం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, ఇన్‌స్పెక్టర్ సురేఖ, అర్చకులు కందాళ వెంకటాది, భక్తులు పాల్గొన్నారు.

రోడ్లపై ఎవరూ చెత్త వేయొద్దు

కవాడిగూడ: పరిసరాల శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. కొత్తబజార్ గ్రంథాలయ వీధిలో సోమవారం ఆమె బస్తీవాసులతో కలిసి పర్యటించారు. ఇటీవల చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. గుంతల రోడ్లతో పాటు లైబ్రరీ ప్రహరీ పక్కనే నిత్యం చెత్త నిల్వ ఉంటోందని స్థానికులు ఆమెకు తెలిపారు. వెంటనే స్పందించిన ఆమె మున్సిపల్ సిబ్బందితో గ్రంథాలయం వద్ద చెత్తను తొలగింపజేసి 'ఇక్కడ చెత్త వేయొద్దు'అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయించారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

కాచిగూడ: బకాయిలు విడుదల చేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 పే స్కేల్, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని వెంటనే తమ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైవీ సుబ్బయ్య, జీఏ రావు, సుధాకర్, కేజీ రావు, కె.రామేశ్వరం, ఎస్.ప్రసాదరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సురెన్స్ స్కీమ్‌ను ఉపయోగించుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రిటైర్డ్ ఎంప్లాయీస్ ఇన్సురెన్స్ స్కీమ్‌ను ఉపయోగించుకోవాలని భాగ్యనగరం ఆఫ్ బ్యాంక్ ఆఫీసర్స్ వెల్ఫేర్ గ్రూప్ చీఫ్ కోఆర్డినేటర్ లక్ష్మణరావు, ప్రెసిడెంట్ ఎస్‌వీ ప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, కార్యదర్శి తులసి కృష్ణమూర్తి అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భాగ్యనగరం రిటైర్డ్ ఎంప్లాయీస్ ఆఫీసర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇన్సురెన్స్ బెనిఫిట్స్ పొందడానికి అవగాహన పెంచుకోవాలన్నారు. పేమెంట్ ఎలా చేయాలి? అవసరానికి ఎలా ఉపయోగించుకోవాలి? అనే దానిపై అవగాహన కల్పించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

కాచిగూడ: రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. చార్మినార్ ఫరూఖ్ నగర్ ప్రాంతానికి చెందిన ఇస్మాయిల్ (79) సోమవారం ఫలక్‌నుమా – బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. వృద్ధుడు చెవిటివాడు కావడంతో రైలు వస్తున్న శబ్దం వినబడలేదు. ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెస్ట్ అవెలబుల్ స్కీమ్ బకాయిలు చెల్లించాలి


అభివాదం చేస్తున్న గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ 'బెస్ట్ అవెలబుల్ స్కూల్'(బీఏఎస్) స్కీమ్ కింద ప్రైవేట్ పాఠశాల యజమాన్యులకు రూ.180 కోట్లు చెల్లించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్. శ్రీరాంనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాంనాయక్ మాట్లాడుతూ.. వారం రోజులుగా పాఠశాలలకు వెళ్లకుండా పిల్లలు వారి తల్లిదండ్రులు పడిగాపులు కాస్తూ దయనీయమైన స్థితిలో ఉన్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలు విడుదల చేయాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు, నాయకులు రజినీకాంత్, ఉదయకుమార్, అనిల్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అసాధారణ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు

చిక్కడపల్లి: కవిగా.. చిత్రకారుడిగా.. నవలా రచయితగా సృజనాత్మక కళ్లిన అసాధారణ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. సోమవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో 'అడవి బాపిరాజు యాదిలో..'ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డా. ఆయాచిత శ్రీధర్ మాట్లాడుతూ... అడవి బాపిరాజు రాసిన 'నారాయణరావు'నవల నేటికీ తెలుగు సాహితీ లోకంలో అత్యుత్తమ కథలలో ఒకటిగా చెప్పుకుంటారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కథక్ అంజిబాబు, గాయకుడు వెంకటరావు, గానసభ పాలకమండలి సభ్యులు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ అయాచితం శ్రీధర్

శ్రీరాంసాగర్ 2వ దశకు భీంరెడ్డి నరిసింహారెడ్డి పేరు పెట్టాలి


ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న వనం సుధాకర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శ్రీరాం సాగర్ 2వ దశకు మాజీ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు భీంరెడ్డి నరిసింహారెడ్డి పేరు పెట్టాలని ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రారంభమైన ఉద్యమానికి ప్రత్యేక్షంగా నాయకత్వం వహించారన్నారు. భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన గొప్ప నాయకుడని అన్నారు. వందలాది ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర భీంరెడ్డి నరిసింహారెడ్డికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మైదం శెట్టి రమేష్, తుడం అనిల్ కుమార్, తంద్రా కళావతి తదితరలు పాల్గొన్నారు.

పౌరసమాజం నుంచి విప్లవవాదానికి మద్దతు కావాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పౌర సమాజం నుంచి విప్లవ వాదానికి మద్దతు కావాలని అప్పుడే విప్లవోద్యమానికి సంపూర్ణత లభిస్తుందని పూర్వ విప్లవ విద్యార్థి వేదికనాయకులు రాజశేఖర్ అన్నారు. సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో సంక్షోభ కాలంలో విప్లవోద్యమం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పాణి రచించిన శాంతి చర్చలు ప్రజాస్వామ్యం – విప్లవోద్యం వాదోపవాదాల కలబోత పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ... విప్లవోద్యమానికి బయట సమర్థత లేకపోవడం వలనే సన్నగిల్లుతోందని అన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి. లక్ష్మణ్ మాట్లాడుతూ... దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి వేలాది మంది రాడికల్ విద్యార్థులు తమ రక్తాన్ని చిందించారని అన్నారు. వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ... ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని మిలిటెంట్ విద్యార్థి ఉద్యమంతో పాటు సాయుధ తెలంగాణ పోరాటాన్ని నిర్మించడం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు మాలతి, హుస్సేన్, రవి నర్ల, పాణి తదితరులు పాల్గొన్నారు.

మర్చంట్ నేవీలో ఉద్యోగావకాశాలు మెండు

ముషీరాబాద్: మర్చంట్ నేవీలో ఇంటర్, పదో తరగతి ఐటీఐ మెకానిక్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని టీఎస్ రహమాన్ ప్రిన్సిపల్ డీజీ షిప్పింగ్ నోడల్ అధికారి కెప్టెన్ డాక్టర్ అశుతోష్ అన్నారు. సోమవారం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(మహిళ) ముషీరాబాద్ ఐటీఐలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. నేవీ రంగంలో మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించాలన్నారు. మహిళా సాధికారత సాధించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. పదో తరగతి, ఇంటర్ ఐటీఐ తర్వాత మర్చంట్ నేవీలో ఆరు నెలల శిక్షణ ఉంటుందని వెంటనే 100 శాతం ఉద్యోగాలు మంచి జీతంతో దొరుకుతాయని తెలిపారు. ట్రైనింగ్ షిప్ రహమాన్ మర్చంట్ నేవీ శిక్షణతో అనేక కోర్సులు అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మనీషా పాండే, భీమగాని సత్యా, ఎన్ఎస్‌డీఐ (మహిళా) ప్రిన్సిపల్ ఎస్.ప్రియ, ముషీరాబాద్ ఐటీఐ ప్రిన్సిపల్ రాధాకృష్ణమూర్తి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విశ్వపాలక్‌రెడ్డి, ట్రైనింగ్ ఆఫీసర్ మోహన్ బాబు, ఏటీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో కెప్టెన్ అశుతోష్, విద్యార్థులు

ఉపఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు భంగపాటు తప్పదు



అంబర్‌పేట: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు భంగపాటు తప్పదని బీజేపీ సీనియర్ నాయకులు అనిల్ కుమార్‌రెడ్డి, అంబర్‌పేట నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ అచ్చిన మహేశ్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో ఓటర్లు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితులు లేవన్నారు. రెండు పార్టీలు ప్రజలను మభ్యపెట్టే హామీలు ఇచ్చి విఫలమయ్యాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతపరంగా ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. ఇక్కడి ఉపఎన్నికలో పార్టీ గెలుపు ఖాయమని పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థి ఎవరైన విజయం తథ్యమని అన్నారు. ఉప ఎన్నికలో తాము క్షేత్రస్థాయిలో పని చేస్తూ అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

పుస్తకావిష్కరణ

కాచిగూడ: దేశ అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమైందని రాష్ట్ర డీజీపీ (శాంతి భద్రతలు) మహేశ్ భగవత్ అన్నారు. ప్రవీణ్‌రావు రాసిన 'వెలుగులోకి రాని దేశ సేవ చేసేవారి జీవితాలు, భావోద్వేగాలు'అనే పుస్తకాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. కాచిగూడలోని బద్రుక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్ జనరల్ ప్రొ. అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డా. మోహన్ కుమార్, వైస్‌ప్రిన్సిపాళ్లు డాక్టర్ జానకీరాం, డాక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీజీపీ (శాంతి భద్రతలు) మహేశ్ భగవత్

వేడుకగా సుద్దాలు పురస్కారాల ప్రదానోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రజాకవి సుద్దాల జానకమ్మ, హనుమంతు సాహితీ, జానపద, నృత్య పురస్కారాలను సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదానం చేశారు. సాహిత్య రంగానికి ప్రముఖ రచయిత వోల్గా, జానపదానికి ప్రముఖ సినీ గాయని మధుప్రియ, నృత్యానికి ప్రముఖ నర్తకిమణి, లాలీనిధిలకు పురస్కారాలను ప్రదానం చేశారు. సుద్దాల హనుమంతు బాల్య స్నేహితులు ఎన్‌రెడ్డి రామిరెడ్డి, మడిమడకల నర్సిరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద మాట్లాడుతూ... సుద్దాల హనుమంతు పాటలు, రచనలు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. సభకు ముందు సుద్దాల హనుమంతు కూతురు రచ్చ భారతి పాడిన స్మృతి గీతం సభికులను ఆకట్టుకుంది. పూర్వ ప్రభుత్వ సలహాదారులు సుద్దాల సుధాకర్ తేజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరిచందన దాసరి, సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, సీహెచ్. స్వప్న, సాహితి తదితరులు పాల్గొన్నారు.


సుద్దాల జానకమ్మ, హనుమంతు పురస్కారాన్ని అందుకుంటున్న ప్రముఖ రచయిత్రి వోల్గా

సంరక్షకుడే తస్కరుడు.!

వృద్ధ దంపతులపై దాడి చేసి ఆభరణాలతో కేర్ టేకర్ పరార్

కవాడిగూడ: ఒంటరిగా ఉంటున్న వృద్ధ దంపతులపై కేర్ టేకర్ దాడి చేసి బంగారు నగలను అపహరించుకొని పారిపోయాడు. ఈ సంఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హిమాయత్‌నగర్ స్ట్రీట్ నం.6లోని హెరిటేజ్ ఆపార్ట్‌మెంట్‌లో ఆనందరావు (86), అనసూయ (83) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. వృద్ధ దంపతల ఆలనపాలన చూసేందుకు అమెరికాలో ఉండే కుమారుడు ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కేర్ టేకర్‌ను నియమించారు. 8 నెలలుగా గుంటూరుకు చెందిన గోవర్ధన్ కేర్ టేకర్‌గా వారి వద్దే ఉంటున్నాడు. ప్రతి రెండు మూడు రోజులకోసారి కూతుళ్లు వచ్చి వెళ్తుంటారు. అయితే ఆదివారం వారి కుటుంబంలో ఓ శుభకార్యం ఉండగా కూతుళ్లు ఎవరూ రారని తెలుసుకున్న కేర్ టేకర్ ముందుగా వేసుకున్న పథకం ప్రకారం వృద్ధ దంపతులపై సాయంత్ర దాడి చేశారు. వృద్ధురాలు అనసూయ ఒంటిపై ఉన్న బంగారు గాజులు, పుస్తల తాడు, చెవిక మ్మలు, బంగారు గొలుసులు బలవంతంగా తీసుకున్నాడు. ఈ క్రమంలో అడ్డుగా వచ్చిన ఆమె భర్త ఆనందరావుపై దాడి చేసి గాయపరిచాడు.

ఉదయం వరకు రక్తపు మడుగులోనే..

◆ వృద్ధ దంపతులు రాత్రంతా తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయారు. ఉదయం 9గంటల ప్రాంతంలో ఇంటిని శుభ్రం చేయడానికి వచ్చిన పని మనిషికి ఇంటి బయట నుంచి గడియపెట్టి కనిపించింది. దీంతో అనుమానం వచ్చి ఆమె లోనికి వెళ్లి చూడగా ఇద్దరు గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే డీడీకాలనీలోని వారి అల్లుడు శ్రీధర్‌రావుకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దోమలగూడ పోలీసులు సమాచారం ఇచ్చారు.

విజయవాడ, గుంటూరుకు రెండు పోలీసు బృందాలు..

◆ సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు నిర్వహించారు. కేర్‌టేకర్ ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తన బ్యాగ్‌తో బయటకు వెళ్తున్నట్లు సీసీ ఫుటేజీలో పోలీసులు గుర్తించారు. ఈ మేరకు అతడిపై అనుమానంతో కేసు నమోదు చేసుకొని రెండు బృందాలను విజయవాడ, గుంటూరుకు పంపినట్లు తెలిపారు. దంపతులిద్దరిని బర్కత్‌పురాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వారి అల్లుడు తెలిపారు.

ప్రతి కార్యకర్త అభిప్రాయానికి విలువ ఉంటుంది

- ఏఐసీసీ పరిశీలకులు, ఎంపీ శక్తిసిన్హ్ గోహిల్
- ఖైరాతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికకు అభిప్రాయ సేకరణ
- అంబర్‌పేట నేతల అభిప్రాయాలను సేకరిస్తున్న పరిశీలకులు
- అధ్యక్ష ఎన్నిక కోసం పోటీలో ఆరుగురు నేతలు
- సమావేశంలో స్వల్ప వివాదం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు శక్తిసిన్హ్ గోహిల్

అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీలో అంతర్గత స్వేచ్ఛ ఎక్కువ అని, అందుకు అనుగుణంగా పార్టీ జిల్లా డీసీసీ అధ్యక్ష ఎన్నికలు చేపడుతామని ఏఐసీసీ పరిశీలకులు, ఎంపీ శక్తిసిన్హ్ గోహిల్ తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా కష్టపడి పని చేసే నిజమైన కార్యకర్తలకే పార్టీ పదవుల్లో పెద్ద ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఆమోదయోగ్యమైన నిర్ణయాలు ఉంటాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సంఘటన్ శ్రీజన్ అభియాన్‌లో భాగంగా ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్ష ఎన్నిక కోసం సోమవారం బతుకమ్మ కుంటలోని ఓ హోటల్‌లో అభిప్రాయ సేకరణపై ప్రత్యేక సమావేశంలో జరిగింది. ఈ సమావేశానికి పరిశీలకులుగా ఉన్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, నాగసీతారాములుతో కలిసి శక్తిసిన్హ్ గోహిల్ హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా గోహిల్ మాట్లాడుతూ... ఖైరాతాబాద్ జిల్లా అధ్యక్ష ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఖైరాతాబాద్ జిల్లా అధ్యక్ష పదవి కోసం 6 మంది పోటీ పడుతున్నారని తెలిపారు. కార్యకర్తల అభిప్రాయం మేరకే అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని చెప్పారు. ఇక్కడ వ్యక్తిగత అభిప్రాయం చెప్పని వారు గాంధీభవన్‌కు సైతం విచ్చేసి వారి అభిప్రాయం చెప్పవచ్చని తెలిపారు.

◆ సమావేశంలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని ఆమె కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అనంతరం శక్తిసిన్హ్ గోహిల్ ప్రొటోకాల్ ప్రకారం ఒక్కొక్కరిని వ్యక్తిగతంగా కలిసి వారి అభిప్రాయాలను సేకరించారు.

◆ ఈ సమాశంలో ప్రస్తుత ఖైరాతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిత్ అలంఖాన్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, సత్యంగౌడ్, మహిళ విభాగం ఖైరాతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, నారాయణస్వామి, నాయకులు లక్‌పతి యాదగిరి గౌడ్, హరినాథ్‌రెడ్డి, గరిగంటి రమేష్, మోతె రోహిత్, తొలుపునూరి కృష్ణగౌడ్, జె.సత్తిబాబుగౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

లోపలేపిస్తా బిడ్డా.. దాదాగిరి నడవదు

ఏఐసీసీ పరిశీలకు వ్యక్తిగత అభిప్రాయాలను సేకరిస్తుండగా కాంగ్రెస్ పార్టీ తన మార్క్ చర్య బయపడింది. వివాదాలు లేకుండా పార్టీ సమావేశం జరిగితే ఇది కాంగ్రెస్ పార్టీ అని ఆశ్చర్యపోవాలి. పార్టీ సంప్రదాయం ప్రకారం సమావేశంలో వివాదం చోటు చేసుకుని ఒకరినొకరు నెట్టేసుకునే వరకు వెళ్లింది. ఏఐసీసీ పెద్ద అభిప్రాయం సేకరిస్తుండగా ఇతర నియోజకవర్గానికి చెందిన నాయకులు అక్కడ కనబడడంతో వివాదం తలెత్తింది. మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారని మరొకరు ప్రశ్నించడంతో మీకేందుకని బదులు ఇవ్వడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు చేయి చేసుకునే వరకు వెళ్లింది. అక్కడే ఉన్న రోహిణ్‌రెడ్డి జోక్యం చేసుకుని గట్టిగా హెచ్చరించారు. "ఎక్కువ చేస్తే టాస్క్‌ఫోర్స్ పోలీసులను పిలిచి లోపలేపిస్తా బిడ్డా.. ఇక్కడ దాదాగిరి నడవదు"అని గట్టిగా మందలించడంతో వివాదం సద్దుమణిగింది.